# నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, ఆదివారం 25 మే 2025 | MEDAK




శంకర్‌సాగర్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

## బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

జహీరాబాద్, మే 24: బీజేపీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్‌సాగర్ బీఆర్ఎస్‌లో చేరారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సమక్షంలో ఆయన శనివారం జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే మాణిక్‌రావు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశం, యాకూబ్, ఖలీమ్, సుభాశ్, విజయ్, వెంకట్, భీంరావు నాయక్, మోహన్ రాథోడ్, ప్రేమ్‌సింగ్, నగేశ్ పాల్గొన్నారు.

## ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

తూప్రాన్, మే 24 : మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని ఘనపూర్‌లో పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవాల్లో, తూప్రాన్ పట్టణంలోని గంగా భవానీ తల్లి బోనాల జాతరలో శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. వారి వెంట మాజీ జడ్పీటీసీ రాణీ సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు, భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



నారాయణఖేడ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## సీఎం పర్యటనతో ఒరిగిందేమి లేదు

### అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇవ్వని రేవంత్‌రెడ్డి

- జహీరాబాద్ సభ అట్టర్ ఫ్లాప్
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మే 24: సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం జహీరాబాద్ నియోజకవర్గ పర్యటనతో సంగారెడ్డి జిల్లాకు ఒరిగిందేమి లేదని, ఊదరగొట్టే ఉపన్యాసాలు తప్ప ప్రజలకు, జిల్లా అభివృద్ధికి ఎలాంటి భరోసా కల్పించలేదని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి విమర్శించారు. శనివారం నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులను మాత్రమే ప్రారంభించి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టాల్సిన పనుల గురించి సీఎం ప్రస్తావించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నారాయణఖేడ్ అభివృద్ధి విషయంలో సీఎం స్పష్టమైన హామీ ఇవ్వకుండా, సీఎం స్థానంలో ఉండి ప్రయత్నం చేస్తానని చెప్పడమేంటని ఎద్దేవా చేశారు. గత సీఎం కేసీఆర్ బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించేందుకు నారాయణఖేడ్ నియోజకవర్గానికి వచ్చిన సందర్భంలో మున్సిపాలిటీకి రూ.25 కోట్లతో పాటు ప్రతి పంచాయతీకి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసిన విషయాన్ని భూపాల్‌రెడ్డి గుర్తు చేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డిని వేదికపై మాట్లాడే అవకాశం ఇవ్వకుండా, ఆయన ఇచ్చిన వినతిపత్రాన్ని సీఎం ప్రస్తావించారే తప్ప ఎక్కడా స్పష్టమైన హామీ ఇవ్వలేదని, దీంతో స్థానిక ఎమ్మెల్యేకు సీఎం వద్ద ఉన్న విలువేమిటో అర్థమవుతుందన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి నెరవేర్చని కారణంగా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్న విషయం జహీరాబాద్ సభతో తేటతెల్లమైందన్నారు. వేదికపై సీఎం ప్రసంగిస్తున్న సమయంలోనే ప్రజలు వెళ్లిపోవడమే దీనికి నిదర్శనమన్నారు. మహిళలకు రుణాలిస్తామని, ఇందిరమ్మ ఇండ్ల పట్టాలిస్తామని ఇంకా రకరకాల ప్రలోభాలు పెట్టి సభకు తరలించినప్పటికీ, ఆశించిన మేరకు జనం రాలేదన్నారు. వచ్చిన ప్రజలు కూడా సభ ముగియకముందే వెళ్లిపోవడంతో సీఎం సభ అట్టర్ ఫ్లాఫ్ అయ్యిందన్నారు. కాంగ్రెస్ పాలన సజావుగా ఉందనే నమ్మకం కాంగ్రెస్ నాయకులకు ఉంటే, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పదిమంది ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించి ఉప ఎన్నికలు జరపాలని సవాల్ విసిరారు. వచ్చే ఏ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు బుద్ధి చెపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, బూటకపు ఉపన్యాసాలు పక్కనపెట్టి ఇచ్చిన హామీలను అమలుచేసే విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని భూపాల్‌రెడ్డి హితవు పలికారు. ఎంఏ నజీబ్, ఆహీర్ పరశురామ్, ముజామిల్, విఠల్‌రావు, జగదీశ్వర్‌చారి, లక్ష్మణ్‌నాయక్, ఉబేద్, ప్రశాంత్‌సాగర్ పాల్గొన్నారు.

# అందరూ.. నారాజ్!

## సీఎం పర్యటనపై పెదవి విరుపు.. నిధులు, వరాలు ప్రకటించక పోవడంతో జిల్లా ప్రజల ఆవేదన

- సంగమేశ్వర, బసవేశ్వర ఊసెత్తక పోవడంపై రైతుల్లో అసంతృప్తి
- సీఎం పర్యటన తీరుపై సొంత పార్టీ కాంగ్రెస్‌లోనే అసంతృప్తి
- మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు కోరినా నిధులు ఇవ్వని సీఎం
- రేవంత్ వ్యవహార శైలిపై గుర్రుగా మంత్రి దామోదర, ఎమ్మెల్యేలు?
- గ్రూపు రాజకీయాలకు ఆజ్యం పోశారని ఆగ్రహం
- సంగారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్ పర్యటనపై అందరూ అసహనం



సంగారెడ్డి, మే 24(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా పర్యటనపై ప్రజలతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెదవి విరుస్తున్నాయి. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. జిల్లాలో తనతొలి అధికారిక పర్యటన సందర్భంగా సీఎం ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో తన ఇమేజ్ పెంచుకునేందుకు ప్రయత్నించారు తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ మైలేజ్ పెరిగేలా వ్యవహరించలేదని సొంత పార్టీ నేతలు గుర్రుగా ఉన్నారు. సీఎం తన పర్యటనలో జిల్లాకు, జహీరాబాద్‌కు ఎలాంటి వరాలు కురిపించక పోవడంపై ప్రజలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. జిల్లాను సస్య శ్యామలం చేసే సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలపైనా సీఎం ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. జిల్లా, జహీరాబాద్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని మంత్రి దామోదర నర్సింహ, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు కోరినా సీఎం పట్టించుకోలేదు. జహీరాబాద్ పర్యటనలో పైసా విదిల్చలేదు. దీంతో మంత్రి దామోదర సహా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సీఎం తీరుపై గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. సీఎం వరాలు ఇవ్వకపోగా, కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలను ఎగదోసేలా వ్యవహరించారని మంత్రి దామోదర, ఎంపీ షెట్కార్ తదితరులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

### సీఎం పర్యటనతో గ్రూపు రాజకీయాలకు ఆజ్యం

సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్ పర్యటన కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలకు మరింత ఆజ్యం పోసింది. సీఎం జహీరాబాద్ నియోజవర్గ పర్యటన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి నిమ్జ్ భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు అప్పగించే బాధ్యత కట్టబెట్టారు.దీంతో సీఎం నిర్ణయంపై జహీరాబాద్ నియోజకవర్గ నేతలు గుర్రుగా ఉన్నారు. సీఎం జహీరాబాద్ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించకుండా జగ్గారెడ్డికి ప్రాధాన్యత ఇవ్వడంపై జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్, గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి తదితరులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. సీఎంకు జహీరాబాద్ కాంగ్రెస్ నాయకులపై నమ్మకం లేదా? మమ్మల్ని అవమానిపరుస్తూ జగ్గారెడ్డి ఎలా బాధ్యతలు అప్పగిస్తారని, ఏ హోదాలో ఆయన నిమ్జ్ భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తారంటూ జహీరాబాద్ కాంగ్రెస్ ముఖ్యనేతలు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. జగ్గారెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించడంతో ప్రజలు, పార్టీలో పలుచన అయ్యామని కాంగ్రెస్ నేతలు అసహనంతో ఉన్నట్లు సమాచారం. సీఎం సొంత పార్టీ నేతల మధ్య విభేదాలు, గ్రూపురాజకీయాలు పెరిగేలా వ్యవహరించారని జహీరాబాద్ ప్రాంత నేతలు లోలోపన ఆగ్రహంగా ఊగిపోతున్నట్లు తెలిసింది. తమలోనే ఒకరికి నిమ్జ్ భూనిర్వాసితుల బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి లాభం జరుగుతుందని, లేదంటే జహీరాబాద్‌లో పార్టీకి నష్టం జరుగుతుందని కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే తమ ఆవేదన, ఆక్రోశాన్ని వెల్లగక్కుతున్నారు. ఇదే విషయమై చర్చించేందుకు జహీరాబాద్ ప్రాంత నేతలు మంత్రి దామోదరను కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

### అస్తంతృప్తిలో కాంగ్రెస్ శ్రేణులు

సీఎం పర్యటనతో ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి మధ్య విభేదాలు పొడచూపాయి. నారాయణఖేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ విషయంలో సురేశ్ షెట్కార్, సంజీవరెడ్డి మధ్య అంతర్గతంగా పోరు సాగుతున్నది. ఇద్దరు ఎవరికి వారే తమ వర్గానికి చెందిన నాయకుడికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కించుకునేందుకు పోటీపడుతున్నారు. నియోజకవర్గంలో రాజకీయంగా పట్టుబిగించేందుకు ఇద్దరు పోటీపడుతుండటంతో ఇద్దరి మధ్య రాజకీయవైరం మొదలైంది. తాజాగా సీఎం పర్యటన సందర్భంగా ఎంపీ సురేశ్ షెట్కార్ అంతా తానై వ్యవహరించగా, ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ప్రాధాన్యత దక్కలేదు. బహిరంగ సభలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రసంగించేందుకు అవకాశం ఇవ్వలేదు. సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి తాను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరినా సీఎం సానుకూలంగా స్పందించలేదు. తాను ప్రసంగించకుండా ఎంపీ సురేశ్ షెట్కార్ అడ్డుకున్నారని ఎమ్మెల్యే సంజీవరెడ్డి గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. సీఎం పర్యటనతో ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి మధ్య దూరం మరింత పెరిగిందని కాంగ్రెస్ శ్రేణులు అంటున్నాయి. సీఎం పర్యటన నేపథ్యంలో నిర్బంధాలు, కంచెలు, ఆంక్షలు, రైతుల అరెస్టులు జరగడం తమకు నష్టమేనని, ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్‌కు ఇది మేలు చేయదని క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నది. మొత్తానికి సీఎం రేవంత్ పర్యటనతో ఒరిగిందేమీ లేదని కాంగ్రెస్ శ్రేణులు అస్తంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లాకు పైసా విదిల్చని సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం జహీరాబాద్ పర్యటనలో ఎలాంటి వరాలు కురిపించలేదు. జిల్లాకు, జహీరాబాద్‌కు ప్రత్యేక నిధులు ఇవ్వలేదు. దీంతో సీఎం తీరుపై అటు ప్రజలు.. ఇటు కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు జహీరాబాద్ పట్టణం, గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరినా సీఎం స్పందించలేదు. సొంత పార్టీకి చెందిన మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేశ్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి నిధులు ఇవ్వాలని కోరినా సీఎం వారిని లైట్ తీసుకున్నారు. ఎలాంటి నిధులు ప్రకటించలేదు. దీంతో సీఎం తీరుపై ఆ ముగ్గురు నేతలు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. మంత్రి దామోదర రాజనర్సింహ సంగారెడ్డి జిల్లాలోని రెండు ప్రధాన రహదారుల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని, సింగూరు ప్రాజెక్టును టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు ఇవ్వాలని కోరారు. కొత్తగా ఏర్పాటైన రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, మౌలిక వసతుల కల్పనకు నిధులు ఇవ్వాలని కోరారు. మంత్రి దామోదర కోరిన వాటిలో ఏ ఒక్క దానికి సీఎం నిధులు మంజూరు చేయలేదు. మంత్రి కోరిన వాటిపై సమీక్ష జరిపి నిధులు ఇస్తామని సీఎం దాటవేశారు. ఎంపీ సురేశ్ షెట్కార్ జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాలకు నిధులు కోరినా సీఎం రేవంత్‌రెడ్డి పైసా నిధులు ప్రకటించలేదు. జహీరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి రూ.50 కోట్లు ఇవ్వాలని సురేశ్ షెట్కార్ కోరారు. సీఎం ప్రారంభించిన జహీరాబాద్‌లోని రైల్వే ఓవర్ బ్రిడ్జికి దివంగత మాజీ మంత్రి ఫరీదుద్దీన్ పేరు పెట్టాలని సురేశ్‌షెట్కార్ కోరినప్పటికీ సీఎం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. సీఎం సంగారెడ్డి జిల్లాకు, జహీరాబాద్ నియోజకవర్గానికి ఎలాంటి వరాలు ప్రకటించక పోవడంతో ప్రజలతో పాటు మంత్రి దామోదర, ఇతర ముఖ్యనేతలు గుర్రుగా ఉన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన నియోజకవర్గానికి నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా సీఎం స్పందించలేదు.

## చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



బక్కి వెంకటయ్య

దుబ్బాక, మే 24: దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి రాజకీయాలపై కనీస అవగాహన లేదని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మండిపడ్డారు. శనివారం సాయంత్రం దుబ్బాకలో మీడియాకు ఆయన ప్రెస్‌నోట్ విడుదల చేశారు. చౌదర్‌పల్లి భూముల విషయంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధం లేదని, అతడి స్వార్థ రాజకీయాల కోసం తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల తనపై చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, అతడి అనుచరులు తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ కమిషన్ అనేది రాజ్యాంగ బద్ధమైన పదవి, వ్యవస్థ అని వివరించారు. దీనిపై ఇష్టానుసారంగా తప్పుడు వ్యాఖ్యలు చేస్తే సహించబోమని, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగితే కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డికి రాజకీయాలపై పరిపక్వత రాలేదని, ఆయన వ్యవహార శైలి ఇంకా పిల్ల చేష్టలుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి అధికార పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగటం హాస్యస్పదంగా ఉందని, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ఆయన దృష్టిపెట్టాలని హితవు పలికారు. చౌకబారు రాజకీయాలతో కాలయాపన చేయడం తగదని, ఇకపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమని బక్కి వెంకటయ్య హెచ్చరించారు.

## సంజీవని దవాఖాన సేవలు స్ఫూర్తిదాయకం

- పసిపిల్లల ప్రాణాలను కాపాడుతున్న సత్యసాయి ట్రస్ట్
- సత్యసాయి సంజీవని సేవలు ప్రపంచమంతా విస్తరించాలి
- భారత బ్యాడ్మింటన్ టీమ్ ప్రధాన కోచ్ పుల్లెల గోపీచంద్
- సత్యసాయి సంజీవని దవాఖాన సందర్శన




గుండె ఆపరేషన్లు చేయించుకున్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పుల్లెల గోపీచంద్




గుండె ఆపరేషన్లు చేయించుకున్న చిన్నారులను ప్రోత్సహిస్తున్న గోపీచంద్

కొండపాక(కుకునూరుపల్లి), మే 24: గుండె జబ్బులతో ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న చిన్నారులకు అండగా నిలిచి ఉచితంగా ఆపరేషన్లు చేసి పసిపిల్లలకు పునర్జన్మను ప్రసాదిస్తున్న సత్యసాయి ట్రస్ట్ అందిస్తున్న నిస్వార్థ సేవలు నేటి సమాజానికి స్ఫూర్తిగా నిలిచాయని భారత బ్యాడ్మింటన్ టీమ్ జాతీయ ప్రధాన కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. శనివారం కొండపాక మండల కేంద్రంలోని సత్యసాయి సంజీవని దవాఖానను ఆయన సందర్శించారు. సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సంజీవని దవాఖానలో ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించుకున్న చిన్నారులకు గిఫ్ట్ ఆఫ్ లైఫ్ సర్టిఫికెట్లను సత్యసాయి సంజీవని దవాఖాన చైర్మన్ శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ.. సమాజంలో స్వార్థం పెరిగిన ఈ రోజుల్లో సంజీవని దవాఖానలో చిన్నారులకు నిస్వార్థ సేవలు అందించడం ప్రశంసనీయం అన్నారు. నిరుపేద కుటుంబాలకు సత్యసాయి ట్రస్ట్ ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయని, సేవే లక్ష్యంగా సత్యసాయి ట్రస్ట్ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని తెలిపారు. చికిత్స కోసం వచ్చే చిన్నారులకు ప్రత్యేక శ్రద్ధతో వైద్యం అందించి, ఇప్పటికే 108 ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేయడం చాలా గొప్ప విషయమన్నారు. సత్యసాయి ట్రస్ట్ అందించే సేవలు భవిష్యత్తులో విశ్వవ్యాప్తంగా విస్తరించాలని ఆకాంక్షించారు. అంతకుముందు విజయవంతంగా గుండె ఆపరేషన్లు చేయించుకున్న చిన్నారులతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు వరదరాజన్ కృష్ణన్, దవాఖాన ఇన్‌చార్జి జగన్నాథశర్మ, సిద్దిపేట మెడికల్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు గ్రామపాలన అధికారుల ఎంపిక పరీక్ష

### పరీక్షకు సర్వం సిద్ధం: సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 24: గ్రామ పాలన అధికారుల పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం ప్రకటనలో తెలిపారు. గ్రామ పాలన అధికారుల నియామకం కోసం స్క్రీనింగ్, అర్హత పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఈనెల 25న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు విధిగా హాల్‌టికెట్‌తో హాజరు కావాలని, అభ్యర్థి ఫొటోను నిర్దేశించిన ప్రదేశంలో అతికించాలని, లేనిపక్షంలో పరీక్షా కేంద్రంలో అనుమతించమని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతిస్తారని, ఉదయం 10 గంటల తరువాత అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించరని వెల్లడించారు. అభ్యర్థులు మొబైల్, సెల్‌ఫోన్లు, టాబ్లెట్లు, పెన్ డ్రైవులు, బ్ల్యూ టూత్ పరికరాలు, పర్సులు, చార్టులు, మణికట్టు గడియారాలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదని పేర్కొన్నారు. ఇంక్, జెల్ పెన్నులను ఉపయోగించవద్దని, పరీక్ష సమయంలో, ఇన్విజిలేటర్ సమక్షంలో అభ్యర్థి హాల్‌టికెట్‌పై సంతకం చేయాలనే పలు సూచనలు కలెక్టర్ వివరించారు. హాల్‌టికెట్‌పై ఉన్న నిబంధనలను పూర్తిగా పాటించాలన్నారు.

**వీసీలో సీసీఎల్ఏ ఆదేశాలు..**

మెదక్ మున్సిపాలిటీ, మే 24 : నేడు జరిగే గ్రామపాలన అధికారి పరీక్షలను పకడ్బందగా నిర్వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి గ్రామపాలన అధికారి పరీక్షల నిర్వహణపై సంబంధిత జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో డీఆర్డీవో భుజంగరావు, మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మన్‌బాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తదితరు అధికారులు పాల్గొన్నారు.



మెదక్ నుంచి వీసీలో పాల్గొన్న డీఆర్డీవో భుజంగరావు, తదితర అధికారులు


# సన్‌ఫ్లవర్ డబ్బులేవి!

## పొద్దుతిరుగుడు రైతుల ఎదురుచూపులు

- జమకాని పొద్దుతిరుగుడు విక్రయ డబ్బులు
- సిద్దిపేట జిల్లాలో 2314 మంది రైతులకు రూ.17 కోట్లు పెండింగ్
- తాత్సారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం







గజ్వేల్, మే 24: పొద్దుతిరుగుడు పంట విక్రయించిన రైతులకు డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు డబ్బులు ఖాతాలో పడుతాయోనని రెండు నెలలుగా రైతులు ఎదురుచూస్తున్నారు. మొదట్లో కేంద్ర ప్రభుత్వం విధించిన లక్ష్యం మేరకు నిర్వాహకులు పొద్దుతిరుగుడు పంట కొనుగోళ్లు పూర్తిచేశారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన రైతులకు డబ్బులు కొద్ది రోజుల్లోనే ఖాతాలో జమయ్యాయి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు పంటకు సంబంధించిన డబ్బులు నేటికి పడకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో మార్చి, ఏప్రిల్ నెలల్లో గజ్వేల్, సిద్దిపేట, తొగుట, చిన్నకోడూరు. బెజ్జంకి, హుస్నాబాద్, కట్కూర్‌లో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి పంటను కొనుగోలు చేశారు. జిల్లాలోని ఏడు కొనుగోలు కేంద్రాల ద్వారా 4306 మంది రైతుల నుంచి 45,261క్వింటాళ్ల పొద్దుతిరుగుడు సేకరించారు. క్వింటాల్‌కు రూ.7280 చొప్పున కొనుగోలు చేశారు. జిల్లాలో 2314మంది రైతులకు సుమారు రూ.17కోట్ల డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. వానకాలం సీజన్ సమీపిస్తుండడంతో విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లకు చేతిలో డబ్బులు లేక రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఉంది. చాలామంది రైతులకు రైతుభరోసా సాయం అందలేదు. పొద్దుతిరుగుడు రైతులు డబ్బుల కోసం పీఏసీఎస్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

### పది రోజుల్లో డబ్బులు జమవుతాయి..

పొద్దుతిరుగుడు రైతులకు డబ్బులు పది రోజుల్లో వారి ఖాతాల్లో జమవుతాయి. రైతులకు రావాల్సిన డబ్బుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రైతులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దు. పది రోజుల్లో డబ్బులు తప్పకుండా వస్తాయి.

– క్రాంతి, మార్క్‌ఫెడ్ డీఎం, సిద్దిపేట

## ఈజీఎస్ పనులను పరిశీలించిన కేంద్ర బృందం

### మొగుడంపల్లి, పడియల్ తండాల్లో పర్యటన

జహీరాబాద్, మే 24: మొగుడంపల్లి, పడియల్ తండాల్లో శనివారం కేంద్ర బృందం పర్యటించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బృందం సభ్యులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్, సీసీ రోడ్లు, పశువుల పాకలు, నర్సరీలో మొక్కల పెంపకం, పల్లెప్రకృతి వనం, రైతు వేదికలు, పాఠశాల భవన నిర్మాణం తదితర పనులను పరిశీలించారు. వారి వెంట సెంట్రల్ గవర్నమెంట్ అధికారి పంకజ్ కుమార్ రానా, జడ్పీ సీఈవో జానకీరామ్, డీపీవో సాయిబాబా, మండల ప్రత్యేకాధికారి గోపాల్ సింగ్, డీఆర్డీవో జ్యోతి, డీఆర్డీఏ ఏపీడీలు బాల్‌రాజ్, పూజ, పీఆర్ డిప్యూటీ ఈఈ రామచందర్, ఎంపీడీవో మహేశ్, ఎంపీవో సంజయ్‌కుమార్, ఏపీవో గణేశ్, పీఆర్ఏఈలు కోటేశ్వర్‌రావు, నవీన్ ఉన్నారు.



మొగుడంపల్లిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు